ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 కనిష్ఠం 24.3
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
గురువారం 27 మార్చి 2025



ఎస్సారెస్పీపై పట్టింపేది?



- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో భారీగా చేరిన పూడిక
- 42 ఏళ్లలో 32 టీఎంసీల సామర్థ్యాన్ని కోల్పోయిన ప్రాజెక్టు
- భారీగా పూడిక చేరికతో ఆయకట్టు సాగుపై ప్రభావం
- పూడికను తొలగించి ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచాలని కోరుతున్న ఆయకట్టు రైతులు

నిజామాబాద్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టింపు లేకుండా పోయింది. ఏటా ప్రాజెక్టులో పూడిక చేరి కెపాసిటీ తగ్గుతున్నా చర్యలు చేపట్టడం లేదు. నిర్మాణ సమయంలో ఇంజనీర్లు ఇచ్చిన సూచనలు అమలు చేయకపోవడంతో 42ఏళ్లలో 32 టీఎంసీల సామర్థ్యాన్ని ప్రాజెక్టు కోల్పోయింది. గోదావరి నదిపై ఉన్న పెద్ద ప్రాజెక్టు సామర్థ్యం తగ్గిపోతుండడం వల్ల ఇప్పటికే పలు దఫాలు అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మాణం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టును 1962 అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం 20ఏళ్లపాటు కొనసాగి 1983లో జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టును 112 టీఎంసీల కెపాసిటీతో నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టు ఏడు సంవత్సరాలు మినహా మిగతా అన్ని సంవత్సరాలు నిండింది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుతుంది. ఈ జిల్లాలే కాకుండా ఖమ్మం, సూర్యాపేట జిల్లాల ప్రాంతాల్లోని కొంత ఆయక ట్టుకు కూడా స్టేజ్ 2 కింద నీటి విడుదల చేస్తు న్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో ప్రతి సంవత్సరం 12లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. మహారాష్ట్రలో పడే వర్షాల ఆధారంగా గోదావరికి వచ్చే వరదల ద్వారా ప్రాజెక్టు నిండుతుంది. ప్రాజెక్టు గోదా వరిపై కట్టినప్పటి నుంచి పరిశీలిస్తే ప్రతి సంవ త్సరం జూన్ 2 లేదా 3వ వారం నుంచి పడే వర్షాల ఆధారంగా వరదరావడం మొదలవుతుంది. జూలై నెలాఖరు వరకు ప్రాజెక్టులోకి నీళ్లు చేరుతాయి. ఆగస్టులో ప్రాజెక్టు నిండడంతో పాటు ఎక్కువసార్లు గేట్లు ఎత్తిన పరిస్థితులు ఉన్నాయి. వానాకాలం సమయంలో ప్రాజెక్టు పరిధిలోని కాకతీయ, లక్ష్మీ, సరస్వతి కాల్వలతో పాటు గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు సాగునీరును అందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వ పరిధిలోని 80శాతం ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు నుంచి 42 ఏళ్లుగా ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణం అయ్యే వరకు ఆరుతడి పంటలు పండించిన రైతులు ప్రాజెక్టు ఆరంభం నుంచి ఇప్పటి వరకు వరిసాగునే చేస్తున్నారు. ఏటా 12లక్షల ఎకరాల వరకు ఈ పంటను ఈ ప్రాజెక్టు పరిధిలోనే సాగు చేస్తున్నారు.

80.3 టీఎంసీలకు తగ్గిన సామర్థ్యం

ఉత్తర తెలంగాణ రైతుల కోసం ఈ ప్రాజెక్టును నిర్మించినా వరద సమయంలో ఇసుక, మట్టిని రాకుండా ఆపేందుకు చర్యలు తీసుకోకపోవడం వల్ల 42ఏళ్లలో 32టీఎంసీల సామర్థ్యాన్ని ప్రాజెక్టు కోల్పోయింది. ప్రాజెక్టు 112టీఎంసీల సామర్థ్యంతో నిర్మించగా ప్రస్తుతం 80.3 టీఎంసీల సామర్థ్యమే ఉంది. ఎగువ ప్రాంతంలో సుమారు 15 నుంచి 20కిలో మీటర్ల వరకు వీటిని పెంచడం వల్ల ఇసుక, మట్టిని ఆపే అవకాశం ఉంటుందని సూచించారు. ఇంజనీర్ల సూచనల ప్రకారం అప్పటి ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోకపోవడం, ఎగువ ప్రాంతం మహారాష్ట్రలో ఉండడం వల్ల అక్కడి అధికారులతో, ఆ ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు చేపట్టకపోవడం వల్ల భారీగా పూడిక చేరింది. ఉమ్మడి రాష్ట్ర హయాంలో పలు దఫాలు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ, రీసెర్చ్ వింగ్ అధికారులు సర్వే చేశారు. ప్రాజెక్టులో పూడిక మట్టిపై అంచనాలకు వచ్చారు. అప్పటి ప్రభుత్వానికి పూడిక తీయాలని సిఫారసులను చేశారు. అప్పటి ప్రభుత్వాలు వాయిదాలు వేశాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా పలుదఫాలు సర్వేను నిర్వహించారు. మద్రాస్‌కు చెందిన ప్రైవేట్ కన్సల్టెన్సీ వారి ఆధ్వర్యంలో కూడా సర్వేను చేశారు. ప్రాజెక్టు పూర్తిగా నిండిన సమయంలో రెండు నెలల పాటు ఈ సర్వేను నిర్వహించారు. మొత్తం ప్రాజెక్టు అంతా పరిశీలించి పూడికపై అంచనాకు వచ్చారు. కెపాసిటీని అంచనా వేసి 80.3 టీఎంసీలకు చేరినట్లు ప్రకటించారు. పూడిక నివారణకు చర్యలను సిఫారసు చేయడంతో పాటు తీసేందుకు ఎంత ఖర్చవుతుందో కూడా ప్రభుత్వానికి నివేదికలో పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదట కడెం ప్రాజెక్టులో పూడిక తీసేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ ప్రాజెక్టు కెపాసిటీ 32 టీఎంసీలు తగ్గిపోవడం వల్ల సుమారు 3లక్షల ఎకరాలకు సాగునీరందించే అవకాశం తగ్గిపోయింది. ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగిస్తే మళ్లీ 112 టీఎంసీలకు తీసుకువస్తే కొత్తగా వచ్చిన టెక్నాలజీని ఉపయోగించుకుంటే ఉత్తర తెలంగాణ జిల్లాలోని ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందించే పరిస్థితి ఉంది. ఈ ప్రాజెక్టులో మొత్తం పూడికను తొలగించాలంటే భారీగా ఖర్చు పెట్టాల్సిన అవకాశం ఉండడంతో మిగతా ప్రాజెక్టులను పరిశీలించిన మీదట చర్యలు చేపట్టే అవకాశం ఉందని ఎస్సారెస్పీకి చెందిన అధికారులు తెలిపారు. కాగా, పూడికను తొలగించి ఎస్సారెస్పీ సామర్థ్యాన్ని పెంచాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.





మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

మానవతా సదన్ విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు



సదన్‌లో లైబ్రరీని ప్రారంభిస్తున్న కలెక్టర్

డిచ్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మానవతా సదన్ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఆకాంక్షించారు. డిచ్‌పల్లి టోల్ వే (ఆథాంగ్ ప్రైవేట్ లిమిటెడ్) సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా సుమారు రూ.45లక్షలు వెచ్చిస్తూ మానవత సదన్‌లో నూతనంగా వివిధ సదుపాయాలు కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు బుధవారం సదన్‌ను సందర్శించి నూతన నిర్మాణాలు, సదుపాయాలను ప్రారంభించారు. కిచెన్, స్టోర్ రూం, డైనింగ్ హాల్, డార్మింటరీ, ప్లే గ్రౌండ్, లైబ్రెరీ తదితర వాటిని పరిశీలించారు. కుండలు, గాజు సీసాలపై బాలికలు అందంగా రూపొందించిన పెయింట్‌గులను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనాథ బాలలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు వీలుగా ఇదివరకు కలెక్టర్‌గా కొనసాగిన ప్రస్తుత రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా 2016లో నెలకొల్పిన మానవతా సదన్ జాతీయ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుందన్నారు. అందుబాటులో ఉన్న వనరులను, జిల్లా యంత్రాంగ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణించాలని ఆకాంక్షించారు. ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని క్రమశిక్షణ, అంకిత భావం, ప్రణాళిక బద్ధంగా చేస్తే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని కలెక్టర్ సూచించారు. తాము అనాథలం అనే భావన రాకుండా అన్ని విధాలుగా జిల్లా యంత్రాంగం చొరవ చూపుతుందన్నారు. డిచ్‌పల్లి టోల్ వే ఆథాంగ్ కంపనీ ముందుకు వచ్చి సదన్‌కు తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సదన్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మానవతా సదన్ లైజనింగ్ ఇన్‌చార్జి సుధాకర్, కేర్ టేకర్ రమేశ్, టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ కంపనీ మేనేజర్ అనిల్, రీష, రోడ్డు విభాగం సెఫ్టీ అధికారి హర్ష, తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌ఐ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిల చెల్లింపులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్

- ఒకే విడతలో చెల్లిస్తే 90 శాతం బకాయి వడ్డీ మాఫీ వర్తింపు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిల చెల్లింపుపై రాయితీ సదుపాయాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌ను అమలు చేస్తుందని కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. ఆస్తిపన్ను బకాయి ఉన్నవారు నిర్ణీత గడువులోపు ఒకే విడతలో బకాయిలు చెల్లిస్తే 90శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రమే ఓటీఎస్‌ను ప్రభుత్వం అమలు చేయగా ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను బకాయిలకు ఈ యేడాది సంవత్సరం ముగిసేలోపు ఏకకాలంలో ఒకే విడతలో చెల్లిస్తే 90శాతం వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. ఈనెల 31వ తేదీలోపు చెల్లించి వడ్డీ రాయితీ అవకాశాన్ని వినియోగించుకొని లబ్ధి పొందాలన్నారు. గడువులోపు ఓటీఎస్ కింద ఆస్తిపన్ను బకాయిలు చెల్లించిన వారికే అవకాశం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూచనకు స్పందించిన ప్రభుత్వం

అసెంబ్లీలో ఆస్తిపన్నుపై సూచనకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ధన్‌పాల్ సూర్యనారాయణ ఈనెల 24న ఆస్తిపన్నుపై వడ్డీ రాయితీ కల్పించాలని అసెంబ్లీలో ప్రభుత్వానికి సూచన చేశారు. దీంతో ప్రభుత్వం స్పందించి వడ్డీ మాఫీపై 90 శాతం రాయితీ కల్పిస్తూ జీవో విడుదల చేసింది.

ధాన్యం సేకరణ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనార్థం జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే రైతులు కంట్రోల్‌రూమ్ 08462-220183 నెంబర్‌కు సంప్రదించి ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. ప్రతీరోజు ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పూర్తిస్థాయి మద్దతు ధర పొందాలని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌లను 18004250033/1976 నెంబర్లను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.



- స్తూపం వద్ద నివాళ్లు అర్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు



మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ జానయ్య



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

ప్రభుత్వాలను గద్దెదించడమే కాదు గద్దెనెక్కించే శక్తి రైతులకు ఉంది

- వ్యవసాయ రంగం అభివృద్ధి బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే..
- తెలంగాణ రైతు మహాసభలో జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ వైస్‌చాన్సలర్ జానయ్య

ఖిల్లా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలను గద్దె దించడమే కాకుండా గద్దె నెక్కించే శక్తి కూడా రైతులకు ఉందని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ జానయ్య అన్నారు. బుధవారం నగరంలోని బీఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో రైతులు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. అందువల్ల పంటల మద్దతు ధరకు చట్టభద్రత కల్పించాలని కోరారు. తాను ఒక రైతు బిడ్డనేనని, మూడు దశాబ్దాలుగా వ్యవసాయంపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు రైతు సమస్యల పరిష్కారం కోసం సరైన కార్యాచరణ రూపొందించడం లేదన్నారు. రైతుల సమస్యలు ఏ విధంగా పరిష్కరించాలోనని.. అందులో ప్రభుత్వ పాత్ర, రైతుల పాత్ర ఏంటి!? అన్న విషయమై విశ్లేషించాల్సిన అవసరముందన్నారు. ఒక సమస్య పరిష్కారం అయ్యేలోపే రైతులకు మరో సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తులు పెరిగాయని, అందుకు మనమంతా గర్వించాలన్నారు. వరితో పాటు మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవాలన్నారు. రైతులు తాము పండించిన పంటలను ఎక్కడ అమ్మాలి? ఏ ధరకు అమ్మాలి? అన్న విషయమై వారికి అవగాహన లేకుండా పోయిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గతంలో కేంద్ర ప్రభుత్వం మూడు చట్టాలను తీసుకొని రావడం జరిగిందన్నారు. అయితే వీటిలో కొన్ని కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేలా ఉందన్నారు. చట్టాలు అధికారికంగా ప్రైవేటు వ్యక్తులకు లైసెన్సులు ఇచ్చే విధంగా ఉన్నాయన్నారు. ఇది బాధ్యత రాహిత్యమన్నారు. చట్టాలు రైతులకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అనంతరం అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతులు పండించే పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి అమలు చేశారని.. మొత్తం 64లక్షల మంది రైతులు ఉంటే, అందులో 18లక్షల మంది రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వ లేదని అన్నారు. 6లక్షల ఖాతాల్లో త ప్పులు దొర్లాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దీన్నే భూభారతిగా చేశారన్నారు. కానీ ఇంతవరకు విధి విధానాలను రూపొందించలేదన్నారు. రైతు రాజు కావాలంటే.. రైతే తన ఉత్పత్తులకు ధర నిర్ణయించుకునే స్థాయికి చేరాలన్నారు. ఈ సమావేశంలో మాజీ శాసన సభ్యుడు ఉజ్జయని యాదగిరిరావ్, వ్యవసాయ విశ్లేషకుడు, శాస్త్రవేత్త నర్సింహారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశ్యపద్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఐఏటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



సీపీ సాయిచైతన్య మార్క్ పాలనకు శ్రీకారం!

- జిల్లా పోలీసు శాఖలో పేరుకుపోయిన అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై ప్రత్యేక దృష్టి
- అక్రమ వ్యాపారాలు, పేకాట స్థావరాలపై నిఘా
- రెండు రోజులుగా నెలవారీ సమీక్షలతో సీపీ సాయిచైతన్య బిజీ

ఖిల్లా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నూతన పోలీసు కమిషనర్ సాయిచైతన్య తన మార్క్ పాలనకు శ్రీకారం చుట్టారు. పోలీసు శాఖలో పేరుకుపోయిన అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిని ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ నెల 9న పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన ఈ నెల 25 నుంచి నెలవారి సమీక్షలను నిర్వహిస్తున్నారు. గతంలో నెలవారీ సమీక్ష ఒకే రోజులో పూర్తయ్యేది. కానీ నూతన సీపీ తన మొదటి నెలవారి సమీక్షను మంగళ, బుధవారాలు రెండు రోజులుగా కొనసాగించారు. నిజామాబాద్ పోలీసు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన కల్మేశ్వర్ సింగనేవారు ఐదు నెలల క్రితం బదిలీపై వెళ్లిపోయారు. అనంతరం నూతన సీపీగా బాధ్యతలు చేపట్టిన సాయిచైతన్య వచ్చి రాగానే జిల్లాలో కొనసాగుతున్న అక్రమ వ్యాపారాలపై నిఘా పెట్టారు. వాటిని కూకటివేళ్లతో పెకిలించి వేయడానికి, వాటిపై ఉక్కుపాదం మోపడానికి రెండు వారాల పాటు అధ్యయనం చేశారు. ఇసుక అక్రమ రవాణా, గుట్కా, గంజాయి రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, పేకాట స్థావరాలపై దృష్టి పెట్టారు. ఇప్పటికే ప్రత్యేక పోలీసు బృందంతో సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. వీటికి తోడు పలు వివాదాల్లో తలదూర్చిన అధికారులపై సైతం చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పోలీసు శాఖలో చర్చలు వినిపిస్తున్నాయి.

క్షుణ్ణంగా రికార్డుల పరిశీలన..

ఐదు నెలలుగా పోలీసు కమిషనరేట్ పరిధిలో జరిగిన పెండింగ్ కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నెలవారి సమీక్షను కేవలం ఒకే రోజు పూర్తి చేసే విధంగా కాకుండా తనదైన శైలితో ఒక్కో ఫైల్‌ను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు ప్రారంభమైన నెలవారి సమీక్ష రాత్రి పది గంటలకు ముగిసింది. సమీక్షకు వచ్చిన సిబ్బందికి కార్యాలయం ఆవరణలోనే లంచ్‌బ్రేక్ ఇచ్చి మరీ కొనసాగించారు. బుధవారం సైతం ఉదయం 11గంటల నుంచి తిరిగి సమీక్షను ప్రారంభించారు. దీంతో ఒక్కో సిబ్బంది పనితీరును విధిగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల పలు వివాదాల్లో ప్రమేయం ఉన్న సిబ్బంది పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించి వారి ఫైళ్లను పరిశీలించినట్లు సమాచారం.

స్వల్పకాలిక రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి

రెంజల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): రైతులు దీర్ఘకాలిక రుణాలతో పాటు స్వల్పకాలిక రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని రెంజల్ సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, నీలా సొసైటీ చైర్మన్ ఇమామ్ బేగ్‌లు అన్నారు. బుధవారం రెంజల్ ప్రాథమిక సహకార సంఘం, నీలా ప్రాథమిక సహకార సంఘాలలో చైర్మన్‌లు మొయినోద్దీన్, ఇమామ్ బేగ్‌ల ఆధ్వర్యంలో మహజన సభను నిర్వహించారు. కార్యదర్శులు ఇంద్రసేన్, రాందాస్‌లు సొసైటీకి సంబంధించిన లావాదేవీల చిట్టాపద్దులను చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రైతులు దీర్ఘకాలిక రుణాలను వన్ టైమ్ సెంటిల్‌మెంట్ చేసుకుని సొసైటీకి సహకరించాలన్నారు.అలాగే స్వల్పకాలిక రుణాలను సైతం రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శులు ఇంద్రసేన్, రాందాస్, సొసైటీ డైరెక్టర్లు ఆసాని ప్రశాంత్, అగ్గు నారాయణ, బొడ్డోళ్ల సాయిలు, సుధాకర్, ఖదీర్ పాషా, అయిటి చంద్రకళ, మన్నె సావిత్రి, సలీం బేగ్, ఆకాష్, లాయక్ అలీ ఖాన్, సిబ్బంది సాయిబాబా, కిషోర్, శ్రీనివాస్, శంకర్, హరీష్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: నవీపేట సొసైటీ మహజన సభను గురువారం నిర్వహించడం జరుగుతుందని సొసైటీ కార్యదర్శి మహేష్ తెలిపారు. ఉదయం 11గంటలకు సొసైటీ కార్యాలయం ఆవరణలో జరిగే మహజన సభను సొసైటీ చైర్మన్ అబ్బన్న అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సంఘ సభ్యులు సకాలంలో మహజన సభకు హజరుకావాలని ఆయన కోరారు.



రెంజల్ సొసైటీలో చిట్టాపద్దులు వినిపిస్తున్న కార్యదర్శి ఇంద్రసేన్

మోస్రా: చందూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో అధ్యక్షుడు ప్యారం అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో మహజన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించి గత సంవత్సరం 01-01-2024 నుంచి 25-03-2025 వరకు జరిగిన జమ, ఖర్చుల ఆమోదంపై పూర్తి వివరాలు తెలిపారు. అదే విధంగా వరి కొనుగోలు గురించి చర్చించడం జరిగింది. హమాలీ ఖర్చు రూ.14, బత్తా కింద ఒక్క రూపాయిని లారీ బత్తా ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘ డైరెక్టర్‌లు మద్దూరి మాధవ రెడ్డి, కోతోల్ల శ్రీనివాస్ రెడ్డి, జుకడి లక్ష్మి, మేడిపల్లి సాయిలు, రాథోడ్ భజన్‌లాల్, నీరడి బాలయ్య, అంగోత్ శంకర్, రైతులు పాల్గొన్నారు.

మామిడిపల్లి చౌరస్తాలో హోటళ్ల తనిఖీ



టిఫిన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్‌టౌన్‌మార్చి26(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిచౌరస్తా పాటు పలు ప్రాంతాల్లోని హోటళ్లు, టిఫిన్‌సెంటర్, చికెన్, మటన్ సెంటర్‌లపై మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు హోటళ్లు, టిఫిన్‌సెంటర్, చికెన్, మటన్ సెంటర్, వ్యాపార సముదాయాల వద్ద పరిశుభ్రత పాటించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్‌లను వాడవద్దని, లేని యెడల భారీ జరిమానాలు విధిస్తామని షాప్ యజమానులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, సిబ్బంది అక్షయ్, ప్రశాంత్, నవీన్, పాల్గొన్నారు.

కొండగట్టుకు హనుమాన్ స్వాముల పాదయాత్ర



నందిపేట నుంచి పాదయాత్రగా కొండగట్టుకు వెళ్తున్న హనుమాన్ స్వాములు

నందిపేట,మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పలువురు ఆంజనేయ మాలధారణ స్వాములు బుధవారం కొండగట్టు ఆలయానికి పాదయాత్రగా బయలు దేరారు. మండల కేంద్రంలోని శ్రీకేదారేశ్వర ఆశ్రమం లో ప్రత్యేక పూజలు చేసిన హనుమాన్ దీక్షా పరులు మండలంలోని వెల్మల్, ఆలూర్, ఆర్మూర్ మండలాల మీదుగా జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయానికి వెళ్తున్నట్లు స్వాములు తెలిపారు.ఆంజన్న ఆలయం స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం తిరుగు ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ దీక్షా పరులలో తిమ్మల ప్రశాంత్, జైపాల్, దమ్మాయి శ్రీను తదితరులు ఉన్నారు.

రక్తదానానికి ముందుకు వచ్చిన యువత

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వల కొరత, వేసవి కాలంలో ముందుకు రాని రక్తదాతలు అనే కథనానికి స్పందించిన యువత స్వచ్ఛందంగా బుధవారం బోధన్ బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తదానం చేశారు. హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో పాటు యువత ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. యువతలో మానవత విలువలు పెరుగుతున్నాయని అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని యువకులు పేర్కొన్నారు.

ఆర్మూర్ నియోజక వర్గ బీఎస్‌పీ అధ్యక్షుడిగా బొర్రోల్ల సురేష్

నందిపేట,మార్చి 26 (ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రానికి చెందిన బొ ర్రోల్ల సురేష్ బుధవారం ఆర్మూర్ నియోజక వర్గం బహుజన సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. ఈసంద ర్భంగా సెంట్రల్ కోఆర్డినేటర్ సిపాని రాంచంద్రం, రాష్ట్ర కార్యదర్శులు గైని గంగారాం, ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు సింగడే పాండు నియామక పత్రాన్ని బొర్రోల్ల సురేష్‌కు అందజేశారు.ఆర్మూర్ నియోజక వర్గం లో బడుగు,బలహీన వర్గాల విద్యార్థులు,రైతులు, కార్మికులు అందరిని ఏకం చేసి బహుజనసమాజ్‌వాదిపార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, సమస్యలపై పోరాటం చేస్తానని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్ తెలిపారు.

ఇద్దరు డ్రైవర్లకు జైలుశిక్ష

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి నలుగురు మృతికి కారణమైన ఇద్దరు డ్రైవర్లకు జైలుశిక్ష విధిస్తూ బోధన్ జడ్జి సాయి శివ తీర్పును వెలువరించారు. 03-10-2014రోజున అక్బర్‌నగర్ గ్రామ శివారులో ఆటో, తుఫాన్ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు చనిపోగా మరో పాప చికిత్స పొందుతూ మృతి చెందింది. అప్పటి వర్ని ఎస్‌ఐ సుఖేందర్ రెడ్డి కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురు మృతికి కారణమైన తుఫాన్ వాహనం డ్రైవర్ శివాజీ బలరాం, ఆటో డ్రైవర్ షేక్.మసీద్‌లపై కేసు నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి నలుగురి మృతికి కారణమైన తుఫాన్ డ్రైవర్‌కు మూడు సంవత్సరాల జైలుశిక్షతో పాటు 3వేల రూపాయల జరిమాన విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లిన ఆటో డ్రైవర్‌కు మూడు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమాన విధించారు. ఆటో డ్రైవర్ లైసెన్స్‌ను ఆరు నెలల పాటు రద్దు చేసినట్లు రుద్రూరు ఎస్‌ఐ సాయన్న తెలిపారు.

ఇంటిని కూల్చివేసిన వారిపై కేసు నమోదు

వేల్పూర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామంలో అక్రమంగా బచ్చుగంగాధర్ ఇంటిని నిర్మించుకున్నాడంటూ గ్రామ స్థులు బుధవారం ఉదయం 5గంటల సమయంలో బ్లేడ్ ట్రాక్టర్‌తో బిచ్చు గంగాధర్ ఇంటిని కూల్చివేశారని ఎస్సై సంజీవ్ తెలిపారు. ఈ ఘటనపై బుచ్చి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని రమేష్ గౌడ్‌కు చెందిన ట్రాక్టర్ రాకేష్‌లను రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపించా మన్నారు. మరి కొంత మంది నిందితులు పరారీలో ఉన్నారన్నారు. మండలం లోని అన్ని గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలు ఏర్పాటు చేసుకున్న అభివృద్ధి కమిటీలు గ్రామాల అభివృద్ధికి పాలుపడాలని అంతేకానీ ఈ విధంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని చట్టవ్యతిరేకమైన పనులను చేయకుండా ఉండాలని ఎస్సై హెచ్చరించారు. మీకేమైన ఇబ్బందులు ఉంటే సంబంధిత శాఖల అధికారులకు సమస్యలను తెలియపరిచి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

శివాలయ సాగు భూముల కౌలుకు వేలం

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాయ శివాలయం సాగు భూముల కౌలుకు గురువారం ఆలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా ఏడుగురు వ్యవసాయదారులు వేలంపాటలో పాల్గొనగా ఉద్మీర్ గల్లీకి చెందిన కే.దశంధర్ అనే వ్యక్తి రెండు సంవత్సరాల లీజు కొరకు 54 వేల రూపాయలకు పాట పాడి వేలంపాటలో దక్కించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ కమల, ఈవో రాములు, ఆలయ కమిటీ అధ్యక్షులు హరికాంత్ చారి, భూమేష్, మహేష్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్‌ను సందర్శించిన అటవీశాఖ అధికారులు



చిరుత పులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించిన అటవీశాఖ బీట్ ఆఫీసర్

నవీపేట,మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమాపూర్ గ్రామాన్ని బుధవారం అటవీశాఖ బీట్ ఆఫీసర్లు సుధీర్, నవీన్‌లు సందర్శించారు. గత రెండు రోజులుగా గ్రామ శివారులోని చీమల గుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు పలువురు పేర్కొనడంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికితీసుకెళ్లగా బీట్‌ఆఫీసర్లుగ్రామాన్ని సందర్శించారు.చిరుతపులి సంచారాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలనివారు సూచించారు. అంతే కాక బుధవారం సాయంత్రం ధర్మారంవైపు సంచరిస్తూ యువకుని వెంటపడిందని సమాచారం. అనంతరం ఉపాధిహామీకూలీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.కమలాపూర్‌లో చిరుత పులిసంచారం విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని బీట్‌ఆఫీసర్లు పేర్కొన్నారు.

ఆర్మూర్‌లో తైబజార్ వేలం వాయిదా



వేలం పాటను వాయిదా వేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్ మార్చి26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని తైబ జార్ వేలంను వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వ హించిన వేలం పాటలో ప్రభుత్వ కనీస ధర రూ.29లక్షల 63వేల 740లు ఉండగా వేలంలో పాల్గొన్న ఇద్దరు కాంట్రాక్టర్‌లు ఎవరు ముందుకు రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వేలం పాటలో పాల్గొనేవారు ఈనెల 28న మధ్యాహ్నం 1గంట వరకు కమిషనర్, ఆర్మూర్ మున్సిపాలిటీ పేరు పైనా రూ.5లక్షల డీడీ, రూ.5వేల (నాన్ రిఫండబుల్) డీడీలు చెల్లిం చి అదే రోజున సాయంత్రం 4గంటలకు తైబజార్ వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

పెద్దమల్లారెడ్డిలో తైబజార్ వేలం

భిక్కనూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామ తైబజార్ వేటం కార్యక్రమాన్ని గ్రామప్రత్యేక అధికారి ఆనందం సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయితీ ఈవో లక్ష్మీ మాట్లాడుతూ గ్రామపంచాయితీ ఆవరణలో నిర్వహించిన తై బజార్ వేలంను గ్రామానికి చెందిన బుడ్డ శ్రీనివాస్ రూ.3.50లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు. పశువుల సంతకు సంబంధించిన తైజార్ వేలానికి కనీస ధర రానందరున వాయిదా వేయ్యడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

లింగంపేట తైబజార్ వేలం

లింగంపేట,మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లింగంపేట గ్రామపంచాయితీ తైబజా ర్ వేలం పాటను బుధవారం నిర్వహించగా వేలంపాటలో రూ.6లక్షల75 వేలకు ఎలారెడ్డికి చెందిన మూజీబ్ దక్కించుకున్నట్లు పంచాయితీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈటెండర్ ఒక సంవత్సరం పాటు ఉంటుందని ఆయన తెలియజేశారు.

డొంకేశ్వర్‌లో వారసంత వేలంపాట

డొంకేశ్వర్, మార్చి26(ఆంధ్రజ్యోతి) డొంకేశ్వర్ మండలంలో జరుగుతున్నటువంటి గ్రామ వారసంత వేలం 2025-26 సంవత్సరానికి గాను ఈనెల 28తేదీ శుక్రవారం వారసంత వేలం పాట నిర్వహించనున్నట్టు పంచాయతీకార్యదర్శి తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30గంటలకు గ్రామపంచాయతీలో వేలం నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు ఉదయం 10గంటల లోపు పంచాయతీలో రూ.10వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

కోస్లీ వారాంతపు సంత వేలం

నవీపేట,మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతకు బుధవారం వేలంపాట నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వేలంపాటలో ఐదుగురు వేలంపాటదారులు పాల్గొనగా ఇందులో నవీపేటకు చెందిన మట్ట బాలాజీ సంతను ఒక లక్ష 500రూపాయలకు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజేష్ తదితరులున్నారు.

మోర్తాడ్‌లో 29న వాహనాల వేలం

మోర్తాడ్, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు వాహనాల వేలం నిర్వహిస్తున్నామని ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ గుండప్ప తెలిపారు. ఈ వేలంలో టీవీఎస్ ఎక్సెల్, ద్విచక్ర వాహనం వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనేందుకు 25శాతం ఈఎండి చెల్లించాలని కోరారు.

మిట్టాపూర్ గోదావరిలో మునిగి జాలరి మృతి

నవీపేట,మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ గోదావరిలో ప్రమాదవశాత్తు మునిగి అదే గ్రామానికి చెందిన మేకల లస్మన్న(49)అనే జాలరి మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మంగళవారం గోదావరిలో చేపలు పట్టడానికి వెళ్లిన లస్మన్న సాయంత్రం ఇంటికి చేరుకోలేదని అతని ఆచూకీ విషయంపై కుటుంబ సభ్యులు గాలించినప్పటికీ సమాచారం లభించలేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉదయం గోదావరిలో లస్మన్న మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ వివరించారు. మృతుడికి భార్య పోసాని, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు అవస్థలు

ఆర్మూర్‌టౌన్, మార్చి26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాల యంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో ఎల్‌ఆర్ ఎస్ దరఖాస్తుదారులు ఫీజును చెల్లించడానికి వెల్లడంతో సర్వర్ సమస్యతో ఆలస్యం అవుతుండగా ఫీజు చెల్లించిన వారికి ప్రొసిడింగ్ కాపీని ఇవ్వడానికి ఒకే ప్రింటర్ ఉండడంతో చాలా సమయం పడుతుంది. దీనికి తోడు వచ్చిన దరఖాస్తుదారులకు క్యాబిన్‌లో నిలబడడానికి చోటు లేక బయట వరండాలో నిలబడుతున్నారు. కొందరు మొకాళ్లు, నడుం నొప్పి బాధలతో నిలబడలేక అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు దరఖాస్తుదారులకు కూర్చొవడానికి కుర్చీలను సమకూర్చకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన వరండాలో ప్రత్యేక ఎల్‌ఆర్‌ఎస్ కౌంటర్‌ను ఏర్పాటు చేసి కంప్యూటర్‌లతో పాటు ప్రింటర్‌లను సమకూర్చాలని దరఖాస్తుదారులకు కుర్చీలు ఏర్పాటు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

● మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



ఇఫ్తార్‌లో పాల్గొన్న మలక్‌పేట్ ఎమ్మెల్యే

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): అల్లా దయ వల్ల ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని మలక్‌పేట ఎంఐఎం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లోని జీనత్ ఫంక్షన్ హాల్‌లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ పార్టీని ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ పార్టీలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనల అనంతరం రంజాన్ ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా దయ వల్ల ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు సమీ, హబీబ్ ఖాన్, జియా అహ్మద్, చాలం చావుస్, హైమద్ చావుస్, అబీద్ ఫారూఖీ, షేర్ ఖాన్, నవీద్ రజా, ఆదిల్, ఏజాజ్‌లతో ఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ సెంటర్‌ను తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకురాలు

నందిపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిష త్ హైస్కూల్‌లో ఉన్న పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని బుధవారంరాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి తనిఖీ చేశారు.మాస్‌కాపీయింగ్‌కు పాల్పడు తున్న ఇన్విజి లేటర్‌కు మెమొ ఇచ్చినట్లు సమాచారం. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే ఉపేక్షించేది లేదని, సెంటర్‌లో పని చేసే అందరిపై చర్యలు ఉంటాయని రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి హెచ్చరించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు సూచించారు ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్ రావు తదితరులున్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు

మోస్రా,మార్చి26(ఆంధ్రజ్యోతి): చందూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పెరుగుతున్న ఎండలకు ప్రజల దప్పిక తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. మండల కేంద్రం మీదుగా కారేగావ్, లక్ష్మాపూర్, మేడిపల్లి, లక్ష్మిసాగర్ తండా గ్రామాల ప్రజలు పలు అవసరాల నిమిత్తం వస్తూ వెళ్తూ ఉంటారు. కావున ఈ చలివేంద్రం ఆందరికి అందుబాటులో ఉంటుంది. కావున వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ డివిజన్ పంచాయతీ అధికారి నాగరాజు, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో మధురిమ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎత్తొండలో ఉపాధి హామీ పనుల పరిశీలన

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ చెరువులో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. పని ప్రదేశం వద్ద కూలీలకు కల్పించిన వసతులపై ఆరా తీశారు. కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. ఎండకాలం దృష్ట్యా ఉదయం వేళల్లోనే పనులను నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో గంగారాం తదితరులున్నారు.

బకాయిలపై వడ్డీ 90శాతం మాఫీ

ఆర్మూర్‌టౌన్ మార్చి26(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈనెల 31వరకు ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీని 90శాతం మాఫీ చేస్తున్నట్లు ఈఅవకాశాన్ని బకాయిదారులు వినియోగించుకోవాలని ఆయనబుధవారం ఒకప్రకటనలో కోరారు.

భీమ్‌గల్:2024-25ఆర్థికసమస్య ముగుస్తున్నందున భీమ్‌గల్ మున్సిపల్ పరిధిలోని ఇంటిపన్ను, వ్యాణిజ్య సముదాయాల పన్ను బకాయిల పడ్డ వారికి 90శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు.ఈఅవకాశాన్ని మార్చి31లోపు వర్తిస్తుందనిపట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోని పన్నులు చెల్లించాలని కమిషనర్ తెలియజేశారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఒకరోజు జైలు

కోటగిరి,మార్చి26(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీన డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన గంగాధర్ అనే వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు రుద్రూరు ఎస్‌ఐ సాయన్న తెలిపారు. రుద్రూరు మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించగా గంగాధర్ తాగి వాహనం నడుపుతుండడంతో అతనిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. ఈ మేరకు న్యాయమూర్తి సదరు వ్యక్తికి ఒకరోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

● ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

ఆర్మూర్‌టౌన్, మార్చి26(ఆంధ్రజ్యోతి) ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండగలను జరుపుకోవాలని ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. బుధవారం: పట్టణంలోని మార్కెట్‌యార్డులో ముస్లీం సోదరులకు అధికారికంగా ఏర్పాటు చేసిన ఆర్మూర్, ఆలూర్ మండలాల ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెష్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, కమిషనర్ రాజు, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, మహమూద్‌అలీ, రహమన్, ఇంతియాజ్, ఫయాజ్, పాల్గొన్నారు.

కాకతీయలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మెండోర, మార్చి26(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలో సోమవారం కాకతీయ కాలువలో గల్లంతైన రాజారాం(28) మృతదేహం లభ్యమైనట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు సమీప బంధువు మారుతి ఆదివారం కాకతీయ కాలువలో కాలకృత్యాలకు వెళ్లి గల్లంతు కాగా అతని ఆచూకి కోసం ద్విచక్ర వాహనాలపై రాజారాం, వినాష్ కాకతీయ కాలువ వెంట వెళ్తుండగా సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కాకతీయ కాలువలోకి దూసుకెళ్ళింది. వెనకల ఉన్న అవినాష్ దుకాణంతో ప్రాణాలతో బయటపడ్డారు. రాజారాం కాకతీయ కాలువలో గల్లంతయ్యారు. రాజారాం మృతదేహం వెల్కటూర్ గ్రామ శివారులో బుధవారం లభ్యమైందని మృతుడు బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

ఇంటి పన్ను అపరాధ రుసుముపై 90శాతం రాయితీ

● బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

బోధన్‌రూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల కోసం ఆస్తిపన్ను, ఇంటి పన్నుల బకాయిలపైన విధించిన అపరాధ రుసుముపైన 90శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ అన్నారు. బుధవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 31, 2025వరకు ఉన్న ఆసి పన్ను బకాయిలపై విధించిన పెనాల్టీ మొత్తంలో 90శాతం మాఫీ ఉంటుందన్నారు. మొత్తం బకాయిలు చెల్లించిన వారికి మాత్రమే ఈ బకాయిలు వర్తిస్తాయన్నారు. పట్టణ ప్రజలు తమ పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. పట్టణంలోని మున్సిపల్ వ్యాపారస్థులు, దుకాణ యాజమానులు, పాఠశాల యాజమానులు తమ పన్నుల బకాయిలను పూర్తిగా చెల్లించి బోధన్ పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



తాళ్లరాంపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో బుధవారం సీసీ రోడ్డు పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్ ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ.15లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరీ చేసిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌కి,జిల్లా ఇన్‌చార్జి మంతి జూపల్లి కృష్ణరావుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో సుదర్శన్,రామాగౌడ్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

రాంనగర్‌లో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నందిపేట:మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో బుధవారం సిమెంట్ రోడ్డుపనులను భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రారంభిం చారు. కాలనీలో సుమారు మూడు రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చుతున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం కింద రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు పటేల్ల రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగ సురేష్, మాజీ ఎంపిటీసీ సభ్యులు ఎలిగేటి, నాయకులు గంగాధర్ గౌడ్, లిం గారెడ్డి, హన్మాండ్లు, నాగ తారక, శ్రీనివాస్ గౌడ్, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

బీర్కూర్: బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో 30 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. బుధవారం ఎంపీడీవో భానుప్రకాష్, ఎంపీవో మహిబూబ్‌లు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. వారి వెంట పీఆర్‌ఏఈ గోపినాథ్, గ్రామ పంచాయితీ కార్య దర్శి గురునాథ్, నాయకులు శ్రీనివాస్, రాజు, వీరప్ప తదితరులు ఉన్నారు.

ఆర్మూర్ మహిళా సమాఖ్యకు ప్రథమ అవార్డు



ఆర్మూర్ మండల సమాఖ్యకు రాష్ట్రస్థాయి ప్రథమ అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క

ఆర్మూర్‌రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండల సమాఖ్యకు స్త్రీనిధిలో రాష్ట్రస్థాయిలో ప్రథమ అవార్డు లభించింది. బుధవారం హైదరాబాద్‌లో స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆర్మూర్ ఏపీఎం గంగారాం, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్పందనకు రాష్ట్రసాథయి ప్రథమ అవార్డు పురస్కారం చేశారు. స్త్రీనిధిలో రుణాలు అందజేసి సకాలంలో రికవరీ చేసినందుకు గాను ఈ పురస్కారం లభించింది.

● స్త్రీనిధి మేనేజర్‌కు ఉత్తమ పురస్కారం

ముప్కాల్, మార్చి26(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల సమైఖ్యలో స్త్రీనిధి మేనేజర్‌గా విదులు నిర్వహిస్తున్న మురళీకృష్ణకు రాష్ట్రస్థాయి ఉత్తమ మేనేజర్ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మంత్రి సీతక్క చేతుల మీదుగా ఉత్తమ అవార్డు మురళీకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ముప్కాల్ మహిళ సమాఖ్యలో తనకు సహకరించిన మహిళలకు, ఏపీఎం ప్రసాద్‌రావుకు సీసీలుకు, ఏవోలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మోతెలో బోదకాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న జిల్లా అధికారి

వేల్పూర్, మార్చి26(ఆంధ్రజ్యోతి): జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు వేల్పూర్ మండలం మోతె గ్రామంలో మంగళవారం రాత్రి 8.30 గంటల నుంచి 12.30గంటల వరకు ఫైలేరియా, నైట్‌బ్లడ్‌సర్వే నిర్వహించారు.గ్రామపంచాయతీ, ప్రాథమి క ఆరోగ్య కేంద్రాలతో పాటు ఇంటింటికి వైద్యసిబ్బంది తిరుగుతూ 231మందికి రక్త నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుక్కారంరాథోడ్ పర్యవేక్షించారు. ఈ కార్య క్రమంలో వైద్యాధికారి శరత్‌చంద్ర, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయి,సీహెచ్‌వో నారాయణ, సూపర్‌వైజర్ తబిత, హెల్త్ అసిస్టెంట్ ఆరోగ్య కార్యకర్తలు ల్యాబ్ టెక్నిషియన్ ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్‌లు సీజ్

భీమ్‌గల్‌రూరల్, మార్చి26(ఆంధ్రజ్యోతి) బడాభీమ్‌గల్‌లో ఉన్న కప్పలవాగు నుంచి బుధవారం ఉదయం6గంటల ప్రాంతంలో అక్ర మంగా ఇసుక తరలిస్తున్నారని పక్క సమాచారం మేరకు అక్కడికి వెళ్ళగా పోలీసులను చూసి పారిపోతున్న నాలుగు ట్రాక్టర్‌లను పట్టుకొని సీజ్ చేసిన ట్లు ఎస్సై మహేష్ తెలిపారు.ట్రాక్టర్ డ్రైవర్‌లపై కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.ఈసందర్భంగా ఎస్సైమహేష్ మాట్లాడుతూ అక్ర మంగా ఇసుక మొరం, నల్ల మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని ఎస్సై హెచ్చరించారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై ఏసీపీకి ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్మూర్‌టౌన్,మార్చి26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర హోంశాఖ సహయక మంత్రి బండిసంజయ్ అనుచిత వ్యాఖ్యాలపై ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్ మాట్లాడుతూ తెలంగాన రాష్ట్ర సాధకుడు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కేంద్ర హోంశాఖ సహయక మంత్రి బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటని, తక్షణమే వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సర్వసమాజ్ అధ్యక్షుడు సుంకరి రవి, సీనియర్ నాయకులు దొండి శ్యామ్, మీర శ్రావణ్, గుండాల పృథ్వీరాజ్, అగ్గుక్రాంతి, శ్రీకర్, పాల్గొన్నారు.


● ఆధ్యాత్మిక ప్రసంగంలో పాల్గొన్న ముస్లింలు


నేడే షబ్-ఏ-ఖద్ర్

● దివ్య ఖురాన్ అవతరించిన మహోన్నత రోజు

కమ్మర్‌పల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చాంద్రమానం ప్రకారం రంజాన్ తొమ్మిదవ నెల, రంజాన్ మాసంలోని 27వ రోజును షబ్-ఏ-ఖద్ర్ (జాగ్ నేకీ రాత్, బడీ రాత్)గా ముస్లింలు కొలుస్తారు. ఈ రోజు రాత్రి జాగరణ పాటించడం అనవాయితీ. షబ్-ఏ-ఖద్ర్ రోజునే అంతిమ దైవ గ్రంథం దివ్య ఖురాన్ అవతరించిన మహోన్నత రోజు రాత్రిగా ముస్లింలు విశ్వసిస్తారు. అందుకే ఈ రోజు రాత్రిని శభప్రదమైన రాత్రిగా కొలుస్తారు. మహమ్మద్ ప్రవక్త (సల్లెల్లాహువలైవసల్లెం)మక్కాలోని హీరా పర్వత గుహల్లో దైవారాధనలో నిమగ్నుడై ఉండగా.. హజ్‌రత్ జిబ్రయీల్ (అలైసలాం) అవతరించి ఖరాన్‌లోని కొన్ని శ్లోకాలను ఆయనతో చదివిస్తాడు. దీనినే వహీ(దివ్యవాణి) అంటారు. హదీస్‌ల ప్రకారం ఈ రోజు రాత్రి జిబ్రాయీల్ అనబడు గొప్ప దైవదూత.. తన వేలాది మంది సిబ్బందితో అల్లాహ ఆజ్ఞలను తీసుకొని భూమిపై అవతరించిన రోజు రాత్రిగా కొలుస్తారు. షబ్-ఏ-ఖద్ర్ రోజు రాత్రి చేసిన ప్రత్యేక ప్రార్థనలు వేయి రాత్రుల పుణ్యాల ఫలితం దక్కుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఈ రోజు రాత్రి భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తే పాపపరిహారం లభిస్తుందని మత పెద్దలు చెబుతారు.

ప్రార్థనలతో పాపపరిహారం

: షేక్‌అహ్మద్ పాషా అమీర్, సహాబ్, కమ్మర్‌పల్లి



రంజాన్ సందర్భంగా ఉపవాసాలు ఉంటు ప్రతిరోజు ఐదు పూటల నమాజ్ తో పాటు ప్రత్యేక తరివీ నమాజ్ చేయడం పరిపాటి రంజాన్ ప్రారంభంనుండి షబ్ ఏ ఖద్ర్ రోజు రాత్రి వరకు పవిత్ర ఖురాన్ పఠనం పూర్తికావడం. రాత్రంతా నమాజ్ చేస్తు భగవత్ ధ్యానలో గడపడంతో పాపపరిహారం లభిస్తుంది, దైవ చింతన ఆధ్యాత్మికత లభిస్తుంది ఏడాదిమొత్తంలో వివిద పనులతో సతమతమైనప్పటికి పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు, ప్రతిరోజు నమాజ్, దైవచింతనలో గడపడం మానసిక ప్రశాంతతకు మార్గం సుగమం అవుతుంది. ఏడాదిమొత్తంలో రంజాన్ మాసం కోసం వేయికళ్లతో ఎదురు చూస్తుంటాం

విశిష్ట రాత్రి షబ్ ఏ ఖద్ర్

: రేహన్‌ఆలం, సహాబ్, కమ్మర్‌పల్లి



రంజాన్ మాసంలో ప్రతిరోజు నమాజ్ చేయడంతో భగవతుడికి దగ్గరవుతాం షబ్ ఏ ఖద్ర్ రోజు రాత్రి ప్రతేక నమాజ్, ఖురాన్ పఠనం వల్ల పాప పరిహారాలు నివృత్తి అవుతాయని ఒక విశ్వసం రంజాన్ మాసం ప్రార్థనల ద్వార దురాలవాట్లకు దూరమై సత్‌ప్రవర్తన అలవడుతుంది. ఈ రాత్రి ప్రార్థనలు అదృష్టంగా భావిస్తాం.

పేదల ఆర్థిక హక్కు 'జకాత్'

● ఇస్లాంలో సముచిత స్థానం



నందిపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): 'వఖీముస్సలాత, వతుజకాతా' పవిత్ర ఖురాన్ గ్రంథంలో మనందరి సృష్టికర్త అయిన అల్లాహు తన మానవులకు ప్రథమంగా విధిగా భోధించేది నమాజ్. రెండో విధి ధర్మాన్ని జకాత్ ద్వారా తన భక్తులకు ఆజ్ఞాపించాడు. అంతేకాకుండా ప్రధాన విధి నమాజ్‌లో అన్ని ఆరాధనలకల్లా శ్రేష్ఠమైన ఆరాధరన దైవానికి దాసుడు నమాజ్ ద్వారా దగ్గరవుతాడు. ప్రతీ రోజూ ఐదు పూటల నమాజ్ పటించి నందున అన్ని చెడులకు దూరమవుతాడు. దీని ద్వారా స్వర్గానికి ప్రాప్తి పొందుతాడు.

● రెండో విధి జకాత్

జకాత్ ద్వారా తాను సంపాదించిన ధనాన్ని అల్లాహు ఆజ్ఞ ప్రకారంగా ఏడాదికి నూటికి (నగదు నుంచి) 2.5 శాతాన్ని ఆదాయంలో నుంచి మినహాయించి నిరుపేదలైన వారికి (తన బంధువులైనా, ఇతరులైనా) ముస్లింలు ధాన, ధర్మాలు చేస్తారు. ఈ విధి ధానంలో తనకు కల్గిన మొత్తం ఆస్తిలో ఇల్లు, పొలాలు, బంగారం, వెండి, జంతువులు సైతం వెలకట్టి అందులో నుంచి 2.5 శాతం దాన, ధర్మాలు చేయాల్సి ఉంటుంది. ఈ దానధర్మాలు చేయటంలో ప్రతీ మనిషిలో దురాశ నశిస్తుంది. అంతే కాకుండా ప్రపంచ భోగభాగ్యాలను ప్రేమించకుండా పరలోకపు నిజ జీవితం కోసం పాటు పడాలని మనిషిలో పేదలపై దయాధాక్షిణ్యాలు కలుగుతాయి. ప్రతీ వ్యక్తి విధిగా దానం చేసినందుకు భక్తిభావం పెంపొందుతుంది. తన ధనము తనది ఏమాత్రం కాదు.. తన ధనములో నిరుపేదలు, వితంతువులు, అనాధలు, భిక్షాటకులు, వ్యాధిగ్రస్తులు పొందే హక్కు కలదు. దానధర్మాలు చేయటం వలన నరకం నుంచి మానవుడు దూరమవుతాడు. స్వర్గ ప్రాప్తి పొందుతాడు. ప్రతీ ముస్లిం తన సృష్టికర్త అయిన అల్లాహుకు భయపడుతూ ఈ రంజాన్ మాసంలో తమకు కలిగిన స్థోమతను బట్టి దానధర్మాలు చేస్తారు. అంతే కాకుండా అల్లాహు ప్రసన్నం కోసం ఎక్కువ మొత్తంలో దానధర్మాలు చేస్తారు. భక్తిలో నీలమై అంకిత భావంతో 'జకాత్' ను తూ.చా. తప్పకుండా పాటిస్తారు.

● ఫిత్రాకు కూడా ప్రాముఖ్యత

జకాత్‌తో పాటు ఫిత్రాకు కూడా రంజాన్ మాసంలో ప్రాముఖ్యత ఉంది. పేద వారికి పండుగ సందర్భంలో ఎంతో కొంత దానం చేయాలని ఇస్లాం బోధిస్తుంది. దీనినే ఫిత్రా అంటారు. అయితే ఈ ఉపవాస దీక్షలు విజయవంతంగా ముగిసిన అనంతరం దేవుడి పట్ల కృతజ్ఞతన భావంతో సంతోషంగా పేదలకు ఫిత్రా ఇస్తుంటారు. ఫిత్రాలో ఆహర ధాన్యాలు లేదా కుటుంబానికి ఒక్క రోజుకు అవసరమైన సొమ్మును కుటుంబ సభ్యులందరి తరఫున కుటుంబ యజమానికి అందజేస్తారు. ఈ దానంతో సర్వ పాపాలు హరించబడుతాయని, కుటుంబ సభ్యులందరికీ పుణ్యం దక్కుతుందని అల్లా నిర్దేశించాడు. ఈ ఉపవాసాన్ని పాటించే సమయంలో హృదయంలో చోటు చేసుకునే చెడు తలంపులు, నోటి నుంచి వెలువడే అసత్య పలుకులు ఫిత్రాతో క్షమించ బడుతాయని ముస్లింల ప్రగాఢ నమ్మకం.


నందిపేటలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


బజార్‌కొత్తూర్‌లో నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

ఆంధ్రజ్యోతి పరిశీలన

గుప్పుమంటున్న గంజాయి

● నిజామాబాద్ జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న అమ్మకాలు ● యువతే లక్ష్యంగా అక్రమార్కుల దందా ● ఇతర రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా దిగుమతి ● నియంత్రణలో ఎక్సైజ్ శాఖ, పోలీసులు విఫలం ● మత్తులో చిత్తవుతున్న యువత

బోధన్ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణాదారులు శ్మశాన వాటికలను సైతం వదలడం లేదు. శ్మశాన వాటికలు జన సంచారం లేకుండా ఉండడంతో రాత్రిపూట వాటిని అడ్డా చేసుకుని అక్రమ దందా వ్యాపారానికి కొత్తగా తెర లేపారు. ఇటీవల బోధన్ పట్టణ శివారులోని శ్మశాన వాటిక వద్ద రెండు కిలోల గంజాయి అక్రమ రవాణాదారులను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకోవడమే నిదర్శనం. గంజాయి విక్రయదారులు చివరికి శ్మశాన వాటికలను సైతం వదలడం లేదు. బోధన్‌లో చిన్నచిన్న కూరగాయల షాపుల్లో సైతం చిన్నచిన్న ప్యాకెట్‌లుగా తయారు చేసి గంజాయి దందా కొనసాగుతోంది.

జిల్లాను ఆవహిస్తున్న గంజాయి మత్తు

బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాను గంజాయి మత్తు అవహిస్తోంది. ఇటీవల గంజాయి రవాణాదారులు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ మార్గాలలో గంజాయిని పట్టణం, నగరానికి తీసుకువచ్చి విచ్చలవిడిగా అమ్మకాలు చేపడుతున్నారు. యువతే లక్ష్యంగా చేసుకుని పలు ప్రాంతాలలో గంజాయి విక్రయాలు జోరుగా కొసాగుతున్నాయి. బోధన్ డివిజన్‌లో, జిల్లా కేంద్రంలో గంజాయి ఆందోళన కలిగించే స్థాయికి చేరుకుంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే తపుడు ఆలోచనతో కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి రకరకాల పద్ధతులలో రవాణా చేసి ఇక్కడ అధిక రేటుకు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారు. గంజాయి అమ్మకాలు పట్టణం, నగరంలో జనాలు సంచరించే ప్రాంతాలు, దినసరి కూలీల అడ్డా, యువత, విద్యార్థులు ఎక్కువగా సమయం గడిపే ప్రధాన కూడళ్ల, రైల్వే స్టేషన్‌లు, బస్సు స్టేషన్‌లు, నిర్మానుష్య ప్రాంతాలను స్థావరాలుగా చేసుకుని గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారు చిత్తవుతుంటే.. విక్రయదారులు లక్షల డబ్బులు సంపాదిస్తూ యథేచ్ఛగా చీకటి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

చిన్న ప్యాకెట్‌లలో విక్రయాలు

గంజాయి అమ్మకందారులు రకరకాల పద్ధతుల్లో ఎవరికి అనుమానం రాకుండా గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్‌లుగా చేసి అమ్ముతున్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాలలో నిల్వ చేసి యువకులకు, దినసరి కూలీల వ్యసనాలను ఆసరాగా చేసుకుని అధిక రేటుకు వారికి అంటగడుతున్నారు. వీరు రకరకాల కోడ్‌లు చెప్పుకుంటూ అమ్మకాలు చేసుకోవడం గమనార్హం.

పెరుగుతున్న నేర ప్రవృత్తి

గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతుండడం, విక్రయాలకు అడ్డు అదుపు లేకుండా పోవడంతో గంజాయి వ్యసనపరులు రాత్రి సమయాల్లో గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్నారు. యువత అర్ధరాత్రి వరకు గంజాయి సేవిస్తూ మత్తులో రాత్రి సమయాల్లో వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అనవసరంగా గొడవలు పడుతూ మత్తులో దారుణాలకు పాల్పడుతున్నారు. యువత గంజాయికి అలవాటు పడి తమ బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఒకరికి ఈ వ్యసనం అలవాటు అయితే అది కాస్త చుట్టు ఉన్న వారికి వ్యాపిస్తుంది. ఒకరిని చూసి మరొకరు గంజాయి బారిన పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.



● ఆచన్‌పల్లిలోని వైకుంఠధామం

పకడ్బందీ చర్యలు చేపట్టాలి

గంజాయి నియంత్రణలో పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉన్న రవాణాదారులపై ఎంత నిఘా పెట్టిన అమ్మకాలు చాప కింద నీరులా విస్తరిస్తూనే ఉన్నాయి. శాంతిభద్రతల వైపు బోధన్ డివిజన్ పోలీసులు దృష్టి కేంద్రీకరించి మంచి పేరు తెచ్చి పెడుతున్న మరో వైపు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపి అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. బోధన్, తదితర మండలాలతో పాటు జిల్లా కేంద్రంలో గంజాయి అక్రమ రవాణాదారులను పట్టుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. పోలీసులు గంజాయి అమ్మకందారులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నప్పటికీ గంజాయి అమ్మకాలు మాత్రం ఆగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొత్తగా వచ్చిన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టాలని, గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని, అమ్మకాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం

: శ్రీనివాస్, బోధన్ ఏసీపీ



యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఉక్కుపాదం మోపుతామని, గంజాయి అమ్మకాలు లేకుండా పకడ్బంది చర్యలు చేపడతామన్నారు. ఇటీవల గంజాయి అమ్మకాలు చేస్తున్న వారి రహస్య స్థావరాలను తెలుసుకుని నియంత్రించడం జరిగిందన్నారు. మరోమారు ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కళాశాలల్లో యువతకు దురఅలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై దృష్టి సారించవద్దని, చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.


● బోధన్‌లో వైకుంఠధామం వద్ద గంజాయి విక్రయదారులను పట్టుకున్న పోలీసులు(ఫైల్)

ఫటా..ఫట్...

ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నాం..

: ఎల్.రామ్, ఎస్సై, సిరికొండ



ఆంధ్రజ్యోతి: మండలంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగేవారిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడాన్ని తగ్గించ గలిగాం. దీంతో రైతుల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. ఎందుకంటే గతంలో బహిరంగా ప్రదేశాల్లో.. ముఖ్యంగా పంటచేలల్లో మద్యం తాగి బాటిళ్లు పగుల గొడుతుండే వారు. ప్రస్తుతం గ్రామాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం గాని, బాటిళ్లు పగులగొట్టడం నిలిచి పోయింది. అంతేకాకుండా ఈ మేరకు కేసులు నమోదు చేయడం వల్లె బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం తగ్గిపోయింది.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో గంజాయి తాగడానికి అలవాటు పడుతున్న వారికి ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఎస్సై: గ్రామాల్లోకి గంజాయి రవాణా కాకుండ విస్తృత తనిఖీలు చేయడం వల్ల గంజాయి రవాణా ఆగిపోయింది. అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం వల్ల మండలానికి గంజాయి రవాణా ఆగిపోయింది. తాగే వారు కూడా చాలా వరకు తగ్గింది. గ్రామాల్లో గంజాయికి బానిస అయిన వారికి కౌన్సెలింగ్ చేయడం వల్ల గంజాయి తాగే వారి సంఖ్యా కూడా చాలా వరకు తగ్గిపోయింది.

ఆంధ్రజ్యోతి: పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ఎస్సై: ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. 80 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పది కేసులు నమోదు చేశాం. కొందరిని రిమాండ్‌కు పంపించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: ఇసుక అక్రమ రవాణా చేయకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై: ప్రభుత్వం అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేయకుండా కఠినంగా వ్యవహరిస్తున్నాం. మూడు కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నాం. పది మంది జేసీబీ డ్రైవర్లు, యజమానులను బైండోవర్ చేశాం.

ఆంధ్రజ్యోతి: పేకాట అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎస్సై: పేకాట ఆడుతున్న వారిని వదలడం లేదు. సమాచారం అందిన వెంటనే స్థావరాలపై దాడులు చేసి పట్టుకుంటున్నాం. దీనిలో భాగంగా ఇప్పటికే మొత్తం 15 వరకు కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించడం జరిగింది.




● ధర్మారం(బి)లో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

కన్నుల పండువగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం

డిచ్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో గల వేంకటేశ్వర ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ధర్మకర్త రావుల బ్రహ్మానందం దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు స్వామి వారికి అందజేశారు. కాగా, ఆలయ పురోహితులు రాహుల్ త్రిపాఠి కల్యాణోత్సవం నిర్వహించారు. ఇందులో భక్తులు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై

ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలి

● కార్యకర్తల సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్

సిరికొండ మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివకుమార్ కార్యకర్తలను కోరారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలలో ముఖ్యమైనవి రైతుల పంట రుణాల మాఫీ లాంటి సాహసోపేతమైన నిర్ణయాన్ని ప్రజలకు వివరించి పార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరారు. స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిన విషయాన్ని బాగా ప్రచారం చేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ముప్పై ఏళ్లుగా అమలుకు నోచుకోని ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టం చేసిన విషయాన్ని కూడా దళిత ప్రజల్లో బాగా ప్రచారం చేయాలని ఆయన కోరారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పార్టీ కోసం పని చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఇప్పటి నుంచే వ్యూహాలు రూపొందించుకోవాలని ఆయన సూచించారు. త్వరలో సిరికొండ మండలంలో జరిగే జై బాపు, జై భీమ్, జై సంవిధాన(రాజ్యాంగం) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతీ కార్యకర్త, నాయకుడు నడుం బిగించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలో పాదయాత్ర ఉంటుందని, నాయకులు సిద్ధం కావాలని కోరారు. అంతకు ముందు కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను తీసుకున్నారు. ఆ తర్వాత మండల అధ్యక్షుడు బాకారం రవి, డీసీసీ కార్యదర్శి గొల్ల ఎర్రన్న, నరేష్, మాలవత్ చందర్, నర్సారెడ్డి, తదితరులు ప్రసంగించారు. ఇందులో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రిక్కా ముత్తెన్న, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పిట్ల నర్సింగ్, శోభన్ యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు ఉమ్మాజి నరేష్, మండల అధ్యక్షుడు ప్రవీన్ వీరు, ప్రవీన్ ఆరే, దేగం సాయన్న, మల్లేష్, రమేష్, నరేందర్, రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సిరికొండలో మాట్లాడుతున్న డీసీసీ ఉపాధ్యక్షుడు శివకుమార్

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు జిల్లాలోని ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతీ యువకుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ఒక్క రేషన్ కార్డుకు ఒకరు మాత్రమే అర్హులని ఈ పథకం ద్వారా రూ.4లక్షల వరకు రుణం అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 55 ఏళ్ల వయస్సు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షల వారు అర్హులన్నారు. సంబంధిత ప్రతులను జతచేసి ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

యువకులందరికీ పథకం వర్తింపజేయాలి..

నిజామాబాద్ అర్బన్: రాజీవ్ యువ వికాసం స్కీమ్‌కు ప్రతి యువకులకు వర్తింపజేయాలని జిల్లా సహాయ బీసీ సంక్షేమ అధికారి నర్సయ్యను బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. బుధవారం బీసీ సంఘం అధ్యక్షుడు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు అధికారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో బీసీ బంధు తీసుకుని ఉంటే ఆ డబ్బులను పూర్తి స్కీమ్‌లో నుంచి మినహాయింపు ఇచ్చి రాజీవ్ యువ వికాసంలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవేందర్, శంకర్, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను క్షయ వ్యాధి నుంచి రక్షించుకోవాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పిల్లలలో క్షయ వ్యాధిపై అవగాహన పెంచి వ్యాధి నుంచి రక్షించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజశ్రీ అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో పిల్లల్లో క్షయ వ్యాధి నిర్మూలనపై జిల్లా కేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్, మండల స్థాయిలో పిల్లల్లో క్షయను గుర్తించి చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సామాజిక ఆరోగ్య కేంద్రం ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రులలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఆరోగ్య సిబ్బంది, వివిధ ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో క్షయ రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ అధికారులు పిల్లల్లో క్షయ లక్షణాలను ముందుగా గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజుగౌడ్, సందీప్, హెస్సిబ, శ్రీనివాస్‌రావు, రవి, రాజేందర్, వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు, సీడీపీవోలు, వైద్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గిరిరాజ్‌లో బీబీఏ విద్యార్థులకు కార్యశాల

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు బీబీఏ విద్యార్థులకు సస్టైయినబులిటి ఇన్ బిజినెస్ క్రియేటివ్ వాల్యూ ఆఫ్ డ్రైవింగ్ చేంజ్ అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ అంజనేయులు హాజరై సుస్థిర వ్యాపార అభివృద్ధి అవకాశాలు, పర్యావరణహిత వ్యాపార విధానాలు వాటిని అమలు చేస్తున్న వ్యాపార సంస్థలు మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యశాలకు మరొక రిసోర్స్‌పర్సన్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగం డీన్ ప్రొఫెసర్ కె.అపర్ణ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఉత్పత్తి మార్కెటింగ్ హెచ్‌ఆర్ సేవా రంగాల్లో సుస్థిర విధానాలు పాటిస్తేనే భవిష్యత్తు తరాలకు భూమిపై మనుగడకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీబీఏ విభాగాధిపతి రంజిత, కామర్స్ విభాగాధిపతి వినయ్‌కుమార్, రజిత, శ్రీనివాస్, సుమన్, సంతోష్, సతీష్, ప్రియాంక, నవీన, శాంతిశ్రీ, గంగలత, చాంద్‌పాషా, రమేష్, సుప్రియ, లక్ష్మీసాగర్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లిన మానాల, కేశవేణు

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగనున్న జిల్లా అధ్యక్షుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు కేశవేణులు ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో కాంగ్రెస్, ప్రభుత్వ పాలనపై చర్చించారు.

'అనుమతుల పునరుద్ధరణ'కు ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న ప్రైవేటు డైట్ కళాశాల అనుమతుల పునరుద్ధరణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు డైట్ కళాశాల స్థాపన కోసం అనుమతులకు సంబంధించి నాలుగు సంవత్సరాల కోసం 2025-26 నుంచి 2028-29, ప్రస్తుతం ఉన్న ప్రైవేటు కళాశాల పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లక్ష రూపాయలను రుసుమును డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్ చెక్కును చెల్లించాలని కోరారు. వివరాలకు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రధానాచార్యులు 6303963931 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలి

ఖిల్లా,మార్చి 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్‌లో కోరారు. ధర్మభిక్ష 14వ వర్ధంతి సందర్భంగా బీఎల్ఎన్‌గార్డెన్‌లో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లుగీత కార్మికుల సమస్యలపై పోరాడిన ధర్మభిక్షాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు రామమూర్తి, సంతోష్‌గౌడ్, నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పొలంబాటలో భాగంగా వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేశామని టీజీఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ రాపెల్లి రవీందర్ తెలిపారు. సర్కిల్ పరిధిలో వదులుగా ఉన్న వైర్లను 322 వైర్లను సరిచేశామని, లిండ్ పోల్స్‌ను 487, ఇంటర్మీడియెట్ పోల్స్‌ను 363, దెబ్బతిన్న స్తంభాలు 438, డబుల్ ఫీడింగ్ స్థానాలు 155, ఐదు అడుగుల క్లియరెన్స్‌తో హెచ్‌టీలు, ఎల్‌టీ క్రాపింగ్‌లు 182, తక్కువస్థాయి రోడ్ క్రాసింగ్‌లు 169, తక్కువ ఎత్తు స్తంభాలను 205ను సరిచేశామని సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు.

సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా విధులు నిర్వహించేలా చూడాలి



మున్సిపల్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి సెల్ఫ్ హెల్ప్ ద్వారా విధులు నిర్వహించేలా చూడాలని బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద బుధవారం బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్, తదితర మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ విభాగాల్లో ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ కార్మికుల సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకు ఇవ్వడం ద్వారా కార్పొరేషన్‌కు 30లక్షల ఆదాయాన్ని కాపాడిన వారమవుతామని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వడం ద్వారా సంవత్సరానికి 30లక్షల ఆదాయాన్ని కార్పొరేషన్ నష్టపోతుందన్నారు. నగర కార్పొరేషన్‌లో 434 మంది 14 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల ద్వారా ఎలాంటి కమీషన్ లాభాపేక్ష లేకుండా పనిచేస్తూ కార్పొరేషన్‌కు 15లక్షలకు పైగా లాభం చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఏజెన్సీల ద్వారా 30లక్షల రూపాయలు నష్టపోతున్నామన్నారు. కార్పొరేషన్‌లో హైదరాబాద్ కాంట్రాక్టును రద్దు చేసి 709 మంది కార్మికులను సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను ఏర్పాటు చేసి కార్మికులకే పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.మురళి, రాహుల్, ఎల్లయ్య, నవీన్, సాయిలు, మోహన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఫీజులను తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం నగరంలోని ప్రభుత్వ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో పరీక్షల విభాగం అధిపతి భరత్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, అకాడమిక్ కోఆర్డినేటర్ పురుషోత్తంలకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 90 శాతం మంది మధ్యతరగతి పేద విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. గతంలోకంటే రెండింతలు ఎక్కువగా ఫీజులు నిర్ణయించడం వల్ల విద్యార్థులు కొందరు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారని అన్నారు. ఒక్కొక్క బ్యాక్‌లాగ్ సబ్జెక్టుకు రూ.700 తీసుకుంటున్నారని రెగ్యులర్ పరీక్షల సెమిస్టర్ ఫీజులకు రూ.1400 నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు కళాశాల మాదిరిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు తీసుకోవడం సరైందికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవిక, సాయికిరణ్, విజయ్, అరవింద్, ప్రవీణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధర్పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మాలతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ఏగ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీగ్రేడ్ ధాన్యానికి రూ.2300లు ప్రభుత్వం అందిస్తుందని ఆమె చెప్పారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. సింగిల్ విండో ఛైర్మన్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహకరిస్తుందని సన్నరకానికి రూ.500 బోనస్ సైతం ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావాలి

ధర్పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణానికి ముందుకు రావాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని సీతాయిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కౌట్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 113 ఇళ్లు మంజూరు కాగా కేవలం 8 మంది లబ్ధిదారులు మాత్రమే ఇంటి నిర్మాణాలను ప్రారంభించారని ఆయన చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు వచ్చి నిర్మించుకోవాలని సూచించారు. విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లకు 5లక్షల నిధులు ప్రభుత్వం సమకూర్చుతుందని చెప్పారు. రాజీవ్ యువశక్తి కోసం యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతాయిపేట కార్యదర్శి కృష్ణకాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో స్వచ్ఛభారత్

నిజామాబాద్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని సుభాష్‌నగర్ రామాలయాన్ని ఇందూరు గో సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని చెత్తా చెదారాన్ని, ఆలయం బయట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా గోసేవా సమితి ప్రతినిధి వీరమల్లి రమేష్ మాట్లాడుతూ ప్రతీ వారం ఆలయాలను శుభ్రం చేస్తున్నామని అన్నారు. అనంతరం పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపండి.. లేదా నన్ను ఎన్‌కౌంటర్ చేయండి

● నగరంలో ఓ యువకుడి హల్‌చల్

ఖిల్లా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనను నిత్యం వేధిస్తున్నారని.. వెంటనే వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో ఎన్‌కౌంటర్ చేయాలని నగరంలో ఓ యువకుడు బుధవారం హల్‌చల్ చేశాడు. జిల్లా కేంద్రానికి చెందిన రసూల్.. గతంలో మాజీ మేయర్ భర్తపై దాడి చేసిన ఘటనలో నిందితుడు. ఈ క్రమంలో తనను నగర ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ నిత్యం వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశాడు. ఒకవేళ వేధింపులు ఆపని పక్షంలో తనను ఎన్‌కౌంటర్ చేయాలని కోరాడు. తన కేసు కోర్టులో నడుస్తుందని, ఇలాంటి సమయంలో ఐదవ టౌన్ ఎస్సై మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆ వీడియోలో పేర్కొన్నాడు. కాగా, ఈ విషయంలో రసూల్‌పై పోలీసు అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతం

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన గణితం పరీక్షకు మొత్తం 22,779 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 22,730 మంది హాజరయ్యారు. 49 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాస్ కాపీయింగ్ కేసు నమోదు కాలేదు. జిల్లా పరిశీలకురాలు 4, డీఈవో 7, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 36 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.

చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్ల తొలగింపు..

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లను జిల్లా పరిశీలకురాలు ఉషారాణి సిఫారసుల మేరకు విధుల నుంచి తొలగించినట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఆంధ్రనగర్ పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ప్రవీణ, నందిపేట సెంటర్‌లో ఇన్విజిలేటర్‌గా పనిచేస్తున ఎంఏ సాజిద్‌లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఈవో తెలిపారు.

వాటర్ డిస్పెన్సర్ల ఏర్పాటు

నిజామాబాద్ లీగల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ హాల్‌లో వాటర్ డిస్పెన్సర్లను జిల్లా జడ్జి సునీత కుంచాలతో కలిసి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ.. న్యాయవాది బాబు వాటర్ డిస్పెన్సర్ అందించడం అభినందనీయమని అన్నారు. వేసవిలో బార్ అసోసియేషన్ ఇలాంటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం కక్షిదారులు న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. న్యాయవాది జేవీఆర్ బాబు తన తండ్రి స్వర్గీయ లక్ష్మీరాజ్యం, తల్లి అనసూయ జ్ఞాపకార్థం నాలుగు వాటర్ డిస్పెన్సర్ డోనేట్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంత్ రావు, న్యాయవాది జేవీఆర్ బాబు సతీమణి చార్టెడ్ అకౌంటెంట్ సవిత, సీనియర్ అడ్వకేట్‌లు జగదీశ్వర్‌రావు, కిరణ్‌కుమార్‌గౌడ్, రాజలింగం, కృపాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, విశ్వక్‌సేన్, పాల్గొన్నారు.

80 గ్రామాల్లో వంద శాతం పన్ను వసూలు

● డీఎల్‌పీవో శ్రీనివాస్

ధర్పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ డివిజన్ పరిధిలో 211 గ్రామాలు ఉండగా ఇందులో 80 గ్రామాల్లో వంద శాతం పన్ను వసూలు జరిగినట్లు డీఎల్‌పీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని రేకులపల్లి గ్రామంలో జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌లో ఆయన పాల్గొని ఇంటిపన్ను సకాలంలో చెల్లించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తాగునీటికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమన్వయంతో గ్రామాల్లోని నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. నీటికొరత ఏర్పడిన గ్రామాల్లో వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆయన ఆదేశించారు. ట్యాంకర్లలో నీటిని సరఫరా చేసేటప్పుడు ముందుగా కెమికల్ టెస్టింగ్‌తో పాటు క్లోరినేషన్ చేయాలని ఆయన సూచించారు. పారిశుధ్యం తాగునీటి, ఇంటిపన్ను వసూళ్లపై కార్యదర్శులు దృష్టిసారించాలని ఆయన పేర్కొన్నారు. మిగతా గ్రామాల్లో ఈ నెలాఖరులోపు వంద శాతం పన్ను వసూలు చేయాలని ఆయన కార్యదర్శులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అశోక్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విశ్వా వసు నామసంవత్సర ఉగాది పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ మాస్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతియేటా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ఆల్‌ది బెస్ట్ అకాడమి అవార్డులను అందిస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు. సమాజ సేవ, పర్యావరణం పరిరక్షణ, వృద్ధుల, వికలాంగుల, విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడ, కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటకరంగం, టీవీ, సినీ రంగాల్లో విశేష కృషి చేసిన వారు అర్హులని అన్నారు. అర్హులైన వారు సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రిక క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్లు, ఫోటోలు జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలను దరఖాస్తుతో జతచేసి ఈనెల మ31వ తేదీలోపు ఆల్‌ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి డోర్ నెంబర్ 1-20-164 గోకుల్‌నగర్, వెంకటాపురం, పోస్ట్ తిరుమలగిరి సికింద్రాబాద్-15కు పంపాలని కోరారు. మరిన్ని వివరాలకు 9652347207 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

జల్సాల కోసం చోరీలు!

ఖిల్లా, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాడు పడిన ఓ యువకుడు డబ్బుల కోసం చోరీలు చేస్తూ ఐదవ టౌన్ పోలీసులకు చిక్కినట్లు నార్త్ రూరల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ తెలపారు. నందిపేట్ మండలం కసాబ్‌గల్లీకి చెందిన శేఖ్ అహ్మద్ మేస్త్రీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వచ్చిన డబ్బు సరిపోకపోవడం, జల్సాలు పెరగడంతో మోటార్ వాహనాల దొంగతనాలను ఎంచుకున్నాడు. చుట్టుపక్కన ఉన్న ప్రాంతంలో వాహనాలను దొంగిలించి మహారాష్ట్రలో అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. ఇందులో భాగంగా నగరంలోని బ్రాహ్మణ కాలనీకి చెందిన లక్ష్మీకాంత్ ఈనెల 25న తన ఆటోను దొంగించారని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు అహ్మద్‌గా గుర్తించామన్నారు. న్యాలకల్ రోడ్డులో గల వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న అహ్మద్‌ను ఆపి విచారణ చేయగా నేరం అంగీకరించడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. అతడి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఐదవ టౌన్ ఎస్సై గంగాధర్, సిబ్బంది కేసును ఛేదించినట్లు ఆయన తెలిపారు.



కలశాలకు అభిషేకం చేస్తున్న పండితులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

మోపాల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వారం రోజుల నుంచి అంగరంగ వైభవంగా సాగుతున్న ఉత్సవాలు బుధవారం యజ్ఞాచార్యులు అర్చక స్వాములు వేదపండితులు 108 కలశాల్లో అభిషేక గంగను తీసుకువచ్చి స్వామి వారికి ఉత్సవానంతరం అభిషేకం చేసి బ్రహ్మోత్సవాన్ని ముగించారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనములతో ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆచార్య గంగోత్రి రామానుజ దాసు స్వామి ఆశీస్సులతో బ్రహ్మోత్సవాలు అద్భుతంగా జరిగాయని ఆలయ ధర్మకర్త నర్సింహారెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలు నర్సింగ్‌పల్లి గ్రామస్థులతో పాటు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయని పేర్కొన్నారు. ముగింపు పూజా కార్యక్రమాల్లో గంగోత్రి రామానుజ దాసు స్వామితో పాటు ఆలయ ధర్మకర్తలు, దిల్‌రాజు దంపతులు, నర్సింహారెడ్డి దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఇఫ్తార్ విందు

నిజామాబాద్ అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ గెజిటెడ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందును నిర్వహించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ముస్లిం ఉద్యోగులు, టీజీవో ప్రతినిధులతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లింలు నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారని అన్నారు. వారి ప్రార్థన ఫలితంగా జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజీవో సంఘ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ముస్లిం మత పెద్దలు మౌలానా హఫీజ్ మహమ్మద్ అబ్దుల్ ఖదీర్, అమృత్‌కుమార్, వాజిద్ హుస్సేన్, యోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో బీఆర్ఎస్ యువజన నాయకుడు బాజిరెడ్డి జగన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు బుధవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రూరల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల బీఆర్ఎస్ నాయకుల, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్‌లు హాజరై ముస్లింలకు పండ్లు తినిపించారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

డిచ్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి 30పడకల ఆస్పత్రి వైద్య విధాన పరిషత్ ఆధీనంలోకి వెళ్లినా ఇంతవరకు పూర్తిస్థాయి సిబ్బందిని నియమించకపోవడంపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అసహనం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి వార్డు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. వైద్య విధాన పరిషత్‌లోకి వెళ్లినా ఆస్పత్రిలో వివిధ విభాగాలకు చెందిన 5గురు డాక్టర్లు వైద్య సేవలు అందించాల్సి ఉండగా ఒక్కరితోనే వైద్య సేవలు ఎలా సాధ్యమని కలెక్టర్ ప్రశ్నించారు. ఇందులో వైద్య సిబ్బంది రాధకృష్ణ, రాజనర్సయ్య, గోపికృష్ణ, సిబ్బంది ఉన్నారు.

శ్రీరామనవమి, హనుమాన్ జయంతి

ఉత్సవాలపై అధికారుల సమీక్ష

నిజామాబాద్ కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని అధికారులు, సిబ్బందితో జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే శ్రీరామనవమి హనుమాన్ జయంతి ఉత్సవాలపై సమీక్ష సమావేశంలో చర్చించారు. అదేవిధంగా దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ఏర్పాటు చేసి కోర్టు కేసులకు కౌంటర్‌లు పంపించి త్వరితగతిన కోర్టులో సరైన డాక్యుమెంట్లు అందించాలని ఎవరైనా విధులకు సరిగ్గా సమయానికి హాజరుకాకపోతే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయాలకు రావాల్సిన కాంట్రిబ్యూషన్ ప్రభుత్వానికి కట్టవల్సిన పన్నులను మార్చి 31లోగా చెల్లించాలని, భూముల యొక్క సర్వే నెంబర్లు సర్వే చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భూముల యొక్క లీజు, పైకపు, షాపు యొక్క అద్దె డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోలు రవీందర్, వేణు, శ్రీరామ్, ఆలయ, దేవాదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు నిషిత, వర్షిని, కీర్తన, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.90,500	రూ.83,500	రూ.1030

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ఎల్-2 ఎంపురాన్ (11.15, 2.50, 6.25, 10.00)
స్క్రీన్-2 : కోర్టు (10.05, 4.30, 7.35, 10.40)
: చావా (హిందీ) (1.10)
స్క్రీన్-3 : వీర ధీర (9.10, 12.30, 3.50, 7.10, 10.30)
స్క్రీన్-4 : ఎల్-2 ఎంపురాన్ (12.05, 7.00)
: చావా (తెలుగు) (3.40, 10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఎల్-2 ఎంపురాన్ (10.40, 4.30)
: కోర్టు (1.45, 7.40, 10.30)
స్క్రీన్-2 : ఎల్-2 ఎంపురాన్ (1.20, 7.20, 10.40)
స్క్రీన్-3 : వీర ధీర (11.00, 1.45, 4.40, 7.30, 10.20)

లలితామహల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : పెళ్లికాని ప్రసాద్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఎల్-2 ఎంపురాన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సలార్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్